విద్యుత్ చార్జీలపై వైసీపీ నమ్మక ద్రోహం

- పెరిగిన విద్యుత్ చార్జీలతో పేదలపై భారం
- త్వరలో విద్యుత్ పోరుబాట, పాదయాత్ర : వామపక్ష పార్టీలు

విశాలాంధ్ర-పలాస : విద్యుత్ చార్జీలపై వైసీపీ ప్రభుత్వం ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తుందని, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రధాని మోడితో జత కట్టి విద్యుత్ రంగాన్ని పూర్తిగా సర్వనాశనం చేస్తుందని వామపక్ష పార్టీలకు చెందిన పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక గణపతి రెసిడెన్సిల్‌లో సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ అధ్యక్షతన పెరుగుతున్న విద్యుత్ చార్జీలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ నాయకులు చాపర సుందరలాల్, చాపర వేణుగోపాల్, సిపిఎం నాయకులు మోహనరావు, లిబరేషన్ నాయకులు సన్యాసిరావు, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, ప్రముఖ వైద్యులు జీవితేశ్వరరావు, ఎన్‌జివో నేత బోనెల గోపాల్, జనసేన నాయకులు సంతోష్ పండాలు మాట్లాడుతూ ఆదాని కార్పొరేట్ సంస్థకు కొమ్ము కాసి విద్యుత్ వినియోగదారుల జేబులు ఖాళీ చేస్తున్నారని, పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. త్వరలో విద్యుత్ చార్జీలపై పోరుబాట, పాదయాత్రలు చేయడం తధ్యమని, పెరిగిన విద్యుత్ భారాలతో పేద మధ్య తరగతి ప్రజలు జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల విషయంలో ముఖ్యమంత్రి నమ్మక ద్రోహం చేశారని, విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని ఉల్లంఘించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 యూనిట్లు లోపు వినియోగించే వారందరికీ ఉచిత విద్యుత్ అని నమ్మించి దాగా చేశారని దుయ్యబట్టారు. భూ పత్రాలు, విద్యార్థుల స్కూల్ బ్యాగులు, పుస్తకాలపై తన బొమ్మలను ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వేసుకోవడం సరికాదని, పెరిగిన విద్యుత్ బిల్లులపై తన బొమ్మలు వేసుకునే దైర్యం ఉందా అని ప్రశ్నించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగం మొత్తాన్ని ఆదాని, ఇతర కార్పొరేటర్లకు కట్టబెట్టడానికి సంస్కరణల పేరుతో చట్టాలు చేస్తుందని, ప్రధాని మోడి ప్రజావ్యతిరేక సంస్కరణలకు ముఖ్యమంత్రి పూర్తిగా లొగ్గిపోయారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాలను మోపుతున్నారని, సర్దుబాటు చార్జీల విధానమే ప్రమాదకరమని, దీనిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నెలనెల విద్యుత్ చార్జీలు పెంచే విధానాన్ని ఉపసంహరించాలని, ప్రజల కళ్లు కప్పి దొడ్డిదారిన ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం మోసపూరిత చర్యగా భావిస్తున్నామని అన్నారు. కార్పొరేటర్ల ఖజానాను నింపడానికి సామాన్యులపై భారాలు మోపుతున్నారనే ఆరోపించారు. పాలకుల అవినీతిల ఫలితమే విద్యుత్ చార్జీల పెంపు అని, స్మార్ట్ మీటర్లు రైతులు, ప్రజల పాలిట ఉరి తాళ్లుగా మారాయని వాపోయారు. స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లల్లో వేల కోట్ల రూపాయలు అవినీతి జరుగుతుందని, దీనిలో రెండు ప్రభుత్వాలు కుమ్మక్కైయ్యాయని ఆరోపించారు. ఆదానికి మోడి మేలు చేస్తుండగా రాష్ట్రంలో షిరిడిసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దోచి పెడుతున్నారని విమర్శించారు. వేసవిని అడ్డం పెట్టి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పోటు ఎక్కువగా ఉందని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లతో ప్రజల గొంతు కోయడానికి పాలకులు సిద్దపడుతున్నారని అన్నారు. ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలపై రాజీ లేని పోరు సాగించాలని పిలుపునిచ్చారు. సర్దుబాటు చార్జీల భారాలను పూర్తిగా ఉపసంహరించాలని, ఆ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలపై సాగే ఐక్య ఉద్యమంలో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ నాయకులు లండ వెంకటరావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా అధ్యక్షులు గొరు వాసుదేవరావు, సిపిఎం నాయకులు నెయ్యిల గణపతి, బమ్మిడి ఆనందరావు, కాంగ్రెస్ నాయకులు శ్యామసుందర్, మధు, తండుగు వీర్రాజు, కుత్తుం దుశ్యంత్, తామాడ సన్యాసి, టీడీపీ నాయకులు లొడగల కామేష్ యాదవ్, నవీన్‌లు పాల్గొన్నారు

యర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమానికి విశేష స్పందన

విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం : ఎంపీ రామ్మోహన్నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : యర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందిందని శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరపు రామ్మోహన్నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి యర్రన్న విద్యా సంకల్పం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా వుండాలనే ఆలోచనతోనే జూన్ 10న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, శ్రీకాకుళం, టెక్కలి, పలాసలలో గ్రూప్ -1, 2, డీఎస్సీ, పోలీసు వంటి మూడు కేటగిరీలలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో వారికి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు ఆద్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటివరకూ 7 వేలమంది నమోదు చేసుకున్నారని మరింత మంది నమోదు చేసుకోవడం కోసం రిజిస్ట్రేషన్ తేదీని ఈనెల 25 వరకూ పొడిగించామన్నారు. జూలై 2వ తారీఖున పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలలో పార్లమెంట్ పరిధిలో ప్రతీ నియోజకవర్గంలోని మొదటి ర్యాంక సాధించిన మూడు కేటగిరీల వారికి 10 వేల రూపాయల చొప్పున ఏడు నియోజకవర్గాల్లో ముగ్గురు చొప్పున 21 మందికి 2 లక్షల 10 వేల రూపాయలు బహుమతిగా అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా ప్రతి నియోజకవర్గంలో ప్రతిభ కనబరిచిన 100 మంది విద్యార్థుల చొప్పున ఏడు నియోజకవర్గాల్లో 700 మందికి వారికి అవసరమైన పుస్తకాల సెట్ ను అందిస్తామని అన్నారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షులు కూన రవి కుమార్, టీడీపీ నాయకులు చౌదరి బాబ్జీ, కొర్ను నాగార్జున ప్రతాప్, మెండ దాసు నాయుడు, మెట్ట సుజాత, అరవల రవీంద్ర, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, తోణంగి యంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయం అంటే పండుగే : మంత్రి ధర్మాన

విశాలాంధ్ర, శ్రీకాకుళం రూరల్: తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అని, తమ హయాంలో వ్యవసాయం చేయడం అంటే పండుగ చేసుకోవడంలాంటిదని రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సింగుపురంలో రూ.26.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఖరీఫ్ సీజన్ 2023 రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ రైతులకు ఎన్ని సహాయ సహకారాలు అందించిన తక్కువేనన్నారు. వారిని లాభాల బాట పట్టించేందుకు ఆర్థికంగా పెద్ద ఎత్తున సహాయం చేస్తున్న ప్రభుత్వం మనదని పేర్కొన్నారు. సాగుదారులకు ప్రభుత్వం చేస్తున్న సహకారం గుర్తించి అండగా ఉండాలన్నారు. మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. 200 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, గొట్ట బ్యారేజ్ దగ్గర లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వంశధార గొట్టా బ్యారేజీ దగ్గర ఎత్తిపోతల పథకం పూర్తయితే మండు వేసవిలో కూడా నీరు అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ఎంపిపిలు అంబటి నిర్మల శ్రీనివాస్, గోండు రఘురాం, జడ్పీటిసి రూప్ప దివ్య, సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, ఎఎంసి చైర్మన్ మూకళ్ళ తాత బాబు, ఎంపిటిసిలు బగ్గు అప్పారావు, నక్క శంకర్, మాజీ సర్పంచ్ గుండ మోహన్ రావు, అరవల రామ కృష్ణ, చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, మానసిక ప్రశాంతత యోగా ద్వారా లభిస్తుందన్నారు. ఈ నెల 21వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 06.00గం.ల నుండి 08.00గం.ల వరకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయని, యోగా శిక్షణ కేంద్రాల వారు కూడా ఇందులో పాల్గొని యోగా వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించనున్నరని, ఈ ఏడాది వసుదైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా శిక్షణ కేంద్రాల వారు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఒక ప్రకటనలో కోరారు.

మోడీ తొమ్మిది సంవత్సరాల సుపరిపాలనపై కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర-రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గం బంటుపల్లి పంచాయతీలో ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ముద్రించిన కరపత్రాలను ఆ పార్టీ విజయనగరం పార్లమెంటరీ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీరామరాజు, ఎచ్చెర్ల అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)లు మంగళవారం ఇంటింటికి పంపిణీ చేసి, మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నచ్చినట్లయితే రాబోయే ఎన్నికల్లో కమలం గుర్తు పై ఓటు వేసి ఎచ్చెర్ల నియోజకవర్గం లో బీజేపీ ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరనాథ్, ఆచారి, బొబ్బిలి శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, ఎస్సీ మోర్చా జోనల్ ఇంచార్జ్ దుక్క ఆదినారాయణ, ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ గొర్లె శ్రీహరి, ఫిషర్ మెన్ సెల్ కన్వీనర్ కొమర లక్ష్మణ్, సీనియర్ లీడర్ పతివాడ పైడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు మంజూరు

జిల్లా డిఆర్‌డిఎ పి.డి విద్యాసాగర్

విశాలాంధ్ర-పలాస : జిల్లాలో గల డ్వాక్రా సంఘాలకు మరో రెండు నెలల్లో 100 కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేయడం జరిగిందని డిఆర్‌డిఎ పి.డి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం పలాస స్త్రీ నిధి భవనంలో సోంపేట క్లస్టర్ పరిధిలోగల పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట, ఇచ్చాపురం, కవిటి, కంచిలి మండలాలకు చెందిన వెలుగు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 49022 డ్వాక్రా సంఘాలుండగా అందులో ఏ గ్రేడ్‌లో 23960, బి.గ్రేడ్‌లో 18320, సి.గ్రేడ్‌లో 6352 సంఘాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఏ గ్రేడ్‌కు 20 లక్షలు, స్త్రీ నిధి 5 లక్షలు, బి.గ్రేడ్‌కు 15 లక్షలు, స్త్రీ నిధి 3 లక్షలు, సి.గ్రేడ్‌కు కేవలం 7 లక్షల రూపాయలు చొప్పున్న రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో స్త్రీ నిధి రూ160 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా రెండు నెలల్లో 5124 డ్వాక్రా సభ్యులకు 33 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి నెల డ్వాక్రా సంఘాలతో తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. దీనికి నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో సమర్ధవంతంగా సంఘాలతో సమావేశం నిర్వహించడం లేదని, దీనిని ఆన్‌లైన్ ద్వారా తెలుస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సిసిలు, సిఎఫ్‌లు, బివోలు పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నారా లేదా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఏపిఎంలపై ఉందన్నారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలను తిరిగి బ్యాంకులకు సకాలంలో చెల్లించే విధంగా సంఘ సభ్యులకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో ఎంపిడివో రమేష్‌నాయుడు, ప్రాంతీయ కోఆర్డినేటర్ మోహనరావు, స్త్రీనిధి జిల్లా ఎజిఎం వి.సత్యన్నారాయణ, జిల్లా డిపిఎం శ్రీధర్, ఐటిఐ డిపిఎం కల్యాణి చక్రవర్తి, స్త్రీ నిధి జిల్లా మేనేజర్ కె.రాము, పలాస మండల ఎంఎంఎస్ అధ్యక్షురాలు రాజేశ్వరి, కోశాధికారి వరలక్ష్మి, ఎపిఎంలు మల్లేశ్వరరావు, జాంబవతి, రమణమ్మ, గోవింద, ఉమాదేవిలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'చలివేంద్రం' బ్యాచ్

కాలేయం వ్యాధి రోగికి రూ.1.85లక్ష ఆర్థిక సాయం

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలోని చలివేంద్రం బ్యాచ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఒక యువకుడు గత కొన్ని నెలలుగా కాలేయం వ్యాధితో బాధపడుతుంటే ఆయనకు సుమారు రూ. 1.85లక్ష ఆర్థిక సాయం చేసి, ఆయనకు పునర్జన్మను ఇచ్చింది. వివరాల్లోకి వెళితే స్థానిక కొత్తవీధికి చెందిన కొండక ఆదినారాయణ కుమారుడు, శరణ్ దీప్ పట్టణంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత కొన్ని నెలల నుండి శరణ్ దీప్ కాలేయం వ్యాధితో తీవ్ర బాధను అనుభవిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన శరణ్‌కు శస్త్రచికిత్స నిమిత్తం డబ్బులు అవసరమని తెలుసుకున్న మాజీ ఎంపిటిసి, మానవతావాది, మార్పు విజయ్‌కుమార్ స్పందించారు. అనంతరం విజయ్‌కుమార్ స్వయంగా బాధితుని గృహానికి వెళ్ళి పూర్తి వివరాలు సేకరించి, తన మిత్రుల వద్ద బాధితుని కష్టం తెలియచేయగా చలివేంద్రం బ్యాచ్, 22గుడ్ ఫ్రెండ్స్ తమకు తోచిన విధంగా విరాళాలు అందచేశారు. మంగళవారం స్థానిక గోరువాని చెరువు ఎదురుగా వున్న ప్రముఖ వ్యాపారి, తంగుడు శ్రీధర్ ఇంటి వద్ద శరణ్ దీప్ తండ్రి, ఆదినారాయణకు చలివేంద్రం బ్యాచ్, 22గుడ్ ఫ్రెండ్స్ సభ్యులు సుమారు రూ.1.85లక్ష అందచేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ శరణ్ దీప్‌కు శస్త్ర చికిత్స విజయవంతమై సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని కోరారు. అనంతరం శరణ్ దీప్ తండ్రి, ఆదినారాయణ మాట్లాడుతూ విరాళాలు అందించిన దాతలందరికీ మా కుటుంబం రుణపడి వుంటుందని, అనారోగ్యానికి గురైన మా కుమారుడికి ఆర్థిక సహాయం చేసినవారందరికీ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాజు టెక్స్‌టైల్స్ ఓనర్, వైశ్యరాజు శ్రీనివాసరాజు, దండి భాస్కరరావు, బి.ఠాగూర్, పొట్నూరు రమేష్, బొంతా సుబ్రహ్మణ్యం, నేతింటి ఎందు, పొట్నూరు సాయిసుధ, తంగుడు సుబ్రహ్మణ్యం, వూణ్ణ సత్యన్నారాయణ, గౌరి, బుద్ధల దుర్గాప్రసాద్, 22గుడ్ ఫ్రెండ్స్ బ్యాచ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ నర్తును విన్నవించిన ఏపీటీఎఫ్ సభ్యులు.

విశాలాంధ్ర-కవిటి : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు ను ఏపీటీఎఫ్ సభ్యులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు నివాసం కొత్తపుట్టుగ గ్రామంలో ఏపిటిఎఫ్ 257 కంచిలి, సోంపేట శాఖ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడానికి ఎమ్మెల్సీ రామారావు సానుకూలత వ్యక్తం చేశారు. ఏపిటిఎఫ్ తరపున ఎమ్మెల్సీ రామారావుకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్చాపురం నియోజకవర్గం ఏపీటీఎఫ్ బాధ్యులు చాణిక్య నయన్ కుమార్, సంతోష్ కుమార్, తిరుపతిరావు, షణ్ముఖరావు, ఈశ్వరరావు, ముకుంద,జనార్ధన పాణిగ్రహి, సోమేశ్వరరావు, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి

ఫైల్ ఫోటో

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం తెల్లవారు జామున రైలుకిందపడి మండలం సరియాపల్లి గ్రామానికి చెందిన చల్ల సింహాచలం (27) మృతి చెందాడు. సింహాచలం నాలుగేళ్ళుగా హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ గ్రామానికి దగ్గరగా ఉంటుందని యేదాది క్రితం విశాఖ జిల్లా అనకాపల్లికి వచ్చి అక్కడ మరో ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. అయితే రెండు నెలలు క్రితం ఇంటికి వచ్చి వెళ్ళిన తరువాత ఏమిజరిగిందో ఏమోగాని మంగళవారం తెల్లవారు సరికి హరిశ్చంద్రపురం రైలు నిలయం సమీపంలో రైలు పట్టాల మధ్య విగతజీవిగా కనిపించాడని బంధువులు బోరునవిలపిస్తున్నారు. మృతిచెందిన సింహాచలం షర్టు పోకెట్‌లోఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా జీఆర్‌పీ అధికారులు కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారని గ్రామస్థులు తెలిపారు. జీఆర్‌పీ హెచ్‌సీ రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పలాసా రైల్వే అసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. ఈమేరకు ఆయన కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా సింహాచలం తండ్రి నారాయణరావు రెండేళ్ళ క్రితం మృతిచెందగా తల్లి చిన్నమ్మడు, తమ్ముడు లోకేష్‌లు ఉన్నారు. సింహాచలం మృతితో సరియాపల్లి గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

కొత్తూరులో పలువురి కుటుంబాలను 'సిరిపురం' పరామర్శ

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం హంస కాలనీకి చెందిన వైసీపీ సీనియర్ లీడర్ పొగిరి గోపాల్‌రావు అన్నయ్య పొగిరి వెంకట్రావు ఇటీవల కాలు విరిగింది. అలాగే జంక వెంకట్రావు చెయ్యి విరగడంతో వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని సిరిపురం తేజేశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు సచివాలయ కన్వీనర్ పొగిరి గోపాలరావు, నెలిరౌతు సాయిరాం, నెలిరౌతు మోహన్ మడిల జగ్గారావు, పొగిరి వెంకటరావు, పొగిరి సింహాచలం, సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, దారపు గోవిందరావు, పైలా భాస్కరరావు, పడాల తిరుపతిరావు, లింగాల వెంకట కృష్ణ తదితర సిరిపురం మిత్ర బృందం సభ్యులు ఉన్నారు.

జనసేన స్థూపం ధ్వంసం చేసినవారిపై తగు చర్యలు తీసుకోవాలి

ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని గొర్లేపాడు పంచాయతీ రాపాక పుట్టుగ,సవసానపుట్టుగ గ్రామాల పరిధిలో హైవే రోడ్డు కు ఆనుకొని మంగళవారం సంత వద్ద జనసైనికులు నిర్మించుకున్న జనసేన స్థూపాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి, జెండా పోల్ ను ఎత్తుకెళ్లారు వెంటనే ఆ దుండగులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు కవిటి మండల జనసేన నాయకులతో కలిసి, కవిటి పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ రాము కు పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ ఇది వరకే ఇలాంటి ఘటనలు పలుమార్లు జరిగాయని కవిటి పోలీస్ కు తెలియపరచడం జరిగిందని,మరల అలాంటి ఘటన పునరావృతం అయిందని,జనసేన పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తూ,ఈ దుచ్చర్యకు పాల్పడిన దుండగులను పోలీస్ వారు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి,జనసేన రాష్ట్ర మత్స్య వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 10 వ వార్డ్ ఇంఛార్జి రోకళ్ళ భాస్కర్, కుసుంపురం సర్పంచ్ అభ్యర్థి అంగ సురేష్, హేమా చలపతి, రాజశేఖర్, తలగాన ఈశ్వర్, వల్లభ రావు, జోగారావు, రామకృష్ణ, ప్రవీణ్ బెహరా, గిరి బెహరా, నవీన్, ధనుంజయం తదితరులు పాల్గొన్నారు.

సోంపేట విద్యార్థినికి సిఎం జగన్ రూ.లక్ష ప్రోత్సాహకం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదువుకున్న ఇటీవల వెలువడిన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో ఎంపీసీ విభాగంలో అత్యధికంగా 986 మార్కులు సాధించిన సోంపేట విద్యార్థిని ఆట్ల అమృతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం విజయవాడలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో లక్ష రూపాయల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, పతకాన్ని బహుకరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దుంపల చిన్నాజీవర్మకు కూడా ఈ సందర్భంగా సీఎం చేతుల మీదుగా మెమెంటో అందజేశారు. అమృతను ముఖ్యమంత్రి జగన్ అభినందించి ఆమె తల్లిదండ్రులు ఆట్ల నవీన్ దంపతులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానించారు. నియోజకవర్గస్థాయిలో ప్రథమస్థానం సాధించినందుకు 15వేల రూపాయలు, అలాగే జిల్లాస్థాయిలో 50వేల రూపాయలు విద్యార్థినికి ఇదివరకే బహుకరించడం విశేషం. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన అమృతను సోంపేట ప్రజలు అభినందించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణంలోని బనిశెట్టివీధి శివారున సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతమ్మ మంగళవారం శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లా వెంకట రమణ, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, వార్డు మెంబర్లు పొందర లోకనాథం, పిట్ట సంతోష్, ఈపరి రవి, కోల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రలకు ప్రశాంసా పత్రాలు

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో ఆరోగ్య మిత్రలుగా పని చేస్తున్న వారు వైద్య అవసరాల కోసం వచ్చే పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. జిల్లాలో ఆరోగ్య మిత్రలుగా మంచి సేవలు అందించిన ఇద్దరికి బుధవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్లో ప్రశంసా పత్రాలు, రూ.5 వేలు నగదు చెక్కులను అందజేశారు. శ్రీకాకుళంలో ఆరోగ్య మిత్రగా పనిచేస్తున్న దబ్బక చిట్టి బాబు, నీలంచెట్టి రమణమ్మలను సీఈఓ హెల్త్ కేర్ ట్రస్టు ఉత్తమసేవా మిత్రలుగా గుర్తించిన నేపధ్యంలో వారిద్దరిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలు వైద్య అవసరాల కోసం వచ్చే పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల, ప్రభుత్వ మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎ స్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కె. ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అద్దింటి యజమానికి కుచ్చు టోపేనా?

విశాలాంధ్ర-పొందూరు: జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ఇంటి యజమానుల అద్దె చెల్లించడంలో సర్కారు నిర్లక్ష్యం పట్ల ఇంటి యజమానులు లబోదిబో మంటున్నారు. 15 నెలలు దాటినా చేతిలో చిల్లు గవ్వ పెట్టకపోవటము ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని అద్దేంటి యజమానులు భయపడుతున్నారు. ఇంటి యజమానులు పడుతున్న ఇబ్బందులు దృశ్య సర్కారు సకాలంలో ఇంటి అద్దెలు చెల్లించి సహకరించాలని ప్రభుత్వానికి కోరుతున్నారు.

ప్రతి గడపకు ఆర్థిక తోడ్పాటు

సంక్షేమ పథకాల పట్ల ప్రజల సంతృప్తి : స్పీకర్ తమ్మినేని సీతారా

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు ఆర్థిక తోడ్పాటు అందుతుందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల దాకా వివిధ పథకాల ద్వారా అందుతున్నాయన్నారు. పిల్లల చదువుల విషయానికొస్తే వారు ఎంత వరకు చదువుకున్నా... మొత్తం ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు ఏడాదికి రూ.13500 రూపా యలు ఇస్తున్నారన్నారు. సాగుచేసి పంట నష్టపోయి ఉంటే పంటల బీమా ఇచ్చి ఆదుకుంటున్నారన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచే విత్తనాలు సరఫరా చేస్తున్నారన్నారు.. ఎమ్మెల్యేలను గ్రామాలకు పంపి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయో తెలుసుకోమని ముఖ్యమంత్రి గారు చెప్పారన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో చిన్న చిన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తమ్మినేని శ్రీరామ్ మూర్తి,జెడ్పీటీసీ బెండి గోవిందరావు, స్థానిక నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, పొన్నాడ కృష్ణారావు,స్థానిక ఎంపీటీసీ పొన్నాడ అనసూయమ్మ,మండల సచివాలయల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు,తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు, సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో రీసర్వే ప్రారంభించిన సర్పంచ్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి రెవెన్యూ గ్రూపులో మంగళవారం, స్థానిక సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు రీసర్వే ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన డ్రోణ్ కెమెరాతో భూములు సర్వే ఒక చారిత్రాత్మక కార్యక్రమం అని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్వో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మిట్టు మహాపాత్రోను అభినందించిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర-పాతపట్నం: గత ప్రభుత్వంలో పెత్తందార్ల చేతిలో బందీ అయిన విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి, లక్షల్లో డబ్బు గుంజే కార్పొరేట్ స్కూళ్ళకన్నా మిన్నగా పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించి, ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చి, డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి, మెరుగైన విద్యను అందిస్తూ, ప్రతి పేద కుటుంబం నుండి ఒక డాక్టరు, ఒక ఇంజనీర్, ఒక కలెక్టర్, ఒక సైంటిస్ట్, ఒక ఎంటర్ ప్రెన్యూర్, ఒక లీడర్‌లాంటి ఆణిముత్యాలు రావాలన్న తపన, తాపత్రయంతో పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వం పిల్లలను మరింత ప్రోత్సహిస్తూ... జగనన్న ఆణిముత్యాలు స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్ -2023బిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తున్న విద్యాసంస్థల్లో చదువుతూ రాష్ట్రస్థాయిలో ఆయా కేటగిరీ విద్యా సంస్థల్లో.. 2022-23 పదవ తరగతి ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన 42 మంది, ఇంటర్మీడియట్‌లో గ్రూపుల వారీగా టాపర్స్ గా సత్తా చాటిన 26 మంది విద్యార్థులకు, వీరితో పాటు ఉన్నత విద్యలో 5 కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20మంది విద్యార్థులను.. నేడు విజయవాడ-ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆణిముత్యాలు స్టేట్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ కేంద్ర నివాసి అయిన మిట్టు మహాపాత్రో, పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పదవ తరగతి ఫలితాల్లో స్టేట్ టాపర్స్‌లో ప్రథమ స్థానంలో నిలవడం పాతపట్నం నియోజకవర్గానికి గర్వకారణం అన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆమదాలవలస

E.P. 3/2020 in O.S. 42/2019

Between
పేడాడ శ్యామలరావు ... D.Hr
మరియు
పడాల మల్లేసు .... J.Dr

బహిరంగ నోటీసు

పై కేసులో J.Dr అయిన పడాల మల్లేసు, S/o. దాలయ్య, ఇంటి నెంబరు. 2-189/A, తంగ తంపర గ్రామం, హిరమండలం మండలం, శ్రీకాకుళం జిల్లా అను మీకు తెలియజేయునది ఏమనగా... శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో మీపై E.P.34/2017 in O.S. 229/2016 గా నమోదైన కేసులో మీ యొక్క ఆస్తి కోర్టు ద్వారా జప్తు చేయబడి, కోర్టు ద్వారా వేలంపాట వేయగా, సదరు పాటదారు డిపాజిట్ చేసిన రూ. 5,30,000లు లో ఆ కేసులోని D.Hr తనకు రావల్సిన రూ. 4,47,618/-లు ను శ్రీ కోర్టు నుండి తీసుకొనగా మిగిలిన సొమ్ము రూ. 82,832/- లు శ్రీ కోర్టు వారి యొక్క P.D. ఖాతాలో మీ పేరును జమ చేయబడి ఉన్నది. ప్రస్తుతం నా క్లయింట్ అయిన పేడాడ శ్యామలరావు, S/o. గోవిందరావు, చింతలపేట గ్రామం, ఆమదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా అను వ్యక్తి పై కేసులో మీ నుండి రావాల్సిన బకాయి రాబట్టుకొను నిమిత్తము వేసిన పై కేసులో తన బాకీలో పాక్షిక భాగం చెల్లింపుగా పైన తెలిపిన మీపేరున గల రూ. 82,832/-లు సొమ్మును తనకు ఇప్పించవలసిందిగా అభ్యర్ధించియున్నారు. సదరు కేసు మీ యొక్క హాజరు నిమిత్తము తే. 05-07-2023 దీన వాయిదా ఉన్నది. కావున పై విషయమై మీకు ఏమైనా అక్షేపణలు ఉన్నట్లయిన పై తేదీన పై కోర్టులో ఉదయం 10.30 గం||లకు స్వయంగా గానీ, లాయరు గారి ద్వారా గానీ హాజరై తెలియపరచుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు పై విషయమును నిర్ధారణ చేయగలరు.

తమ్మినేని అన్నంనాయుడు
నోటరీ లాయరు
ఆమదాలవలస
9948045727

ప్రజాస్వామ్యమా.. గుండా రాజ్యమా...!

టీడీపీ నాయకులు ధ్వజం

విశాలాంధ్ర-మందస: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నాయని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మందస మండల టీడీపీ అధ్యక్షులు భావన దుర్యోధన, టీడీపీ నాయకులు దాసరి తాతారావు, బమ్మిడి కర్రెయ్య, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్యలు అన్నారు. మంగళవారం హరిపురం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాలిగాం గ్రామంలో టీడీపీ జెండాను కొంతమంది అర్ధరాత్రి సమయంలో ధ్వసం చేశారని, దానిని పున:నిర్మించేందుకు మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ సంఘటన స్థలానికి చేరుకున్నారని, అయితే శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం లేకుండా ఉన్న సమయంలో ఇన్‌చార్జీ డిఎస్‌పి భరత్‌చంద్రా రెడ్డి అక్కడకు చేరుకొని భయానక వాతావరణాన్ని సృష్టించారని ఆరోపించారు. ఒక వ్యక్తికో లేదా ఒక పార్టీకో కొమ్ముకాయడం సరికాదని, టీడీపీ జెండా నాలుగు దశాబ్దాలుగా అక్కడ ఉందని, రోడ్డుకు అడ్డంగా ఉందనుకుంటే అక్కడికి 4 మీటర్ల దూరంలో వైసీపీ జెండా దిమ్మ కూడా ఉందని అన్నారు. తమ పార్టీకి చెందిన జెండాను పునరుద్ధరణ చేశాకా.. మళ్లీ పోలీసులు జెసిబిలతో తొలగించడాన్ని తప్పు పట్టారు. ఎంతో సౌమ్యంగా ప్రశాంతంగా ఉంటే మాజీ మంత్రి శివాజీ పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఈ సంఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోకుండా ఆచరణలో పెట్టాలని, సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందించేందుకు దృష్టిసారించాలని అన్నారు. సాగునీటి కాలువలు, చెరువుల్లో పూడికలు పేరుకుపోతున్నా అటువైపు మంత్రి డాక్టర్ సీదిరి ఎందుకు దృష్టిసారించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో నవీన్‌కుమార్, తమ్మినేని ధనుంజయ, జి.కె.నాయుడు, బి.గున్నయ్య, వి.వాసు, ఎస్.క్రిష్ణారావు, హరిక్రిష్ణ, నారాయణరావు, ఎ.తేజ దాసరి వాసు, పుచ్చ భాస్కరరావు, తలగాన రాజశేఖర్, బి.శంకర్, సవర ఢిల్లీరావు, కొర్రాయి బాలక్రిష్ణలు పాల్గొన్నారు.

శ్రీరాముని మార్గం అనుసరణీయం : ఏఎస్పీ విఠలేశ్వర్

విశాలాంధ్ర-అరసవల్లి: శ్రీరాముని మార్గం అనుసరణీయమని, ప్రతీ ఒక్కరూ రామునిలోని సుగుణాలతో మెలిగి సమాజహితానికి పాటు పడాలని అదనపు ఎస్‌పి తిరుపతి పాండురంగ విఠలేశ్వర్ అన్నారు. ఆదిపురుష్ చిత్రం విడుదల సందర్భంగా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జైభీమ్ సంక్షేమ సంఘం ఆటో యూనియన్ అధ్యక్షులు రాయితీ చంద్రశేఖర్ (గబ్బర్) అధ్యక్షతన నగరంలోని పలు రామాలయాలకు నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ముందుగా ఏడురోడ్ల జంక్షన్ వద్ద కోటాంజనేయ స్వామి ఆలయంలో ఆదిపురుష్ చిత్ర యూనిట్ సభ్యుల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ తండ్రి మాటను జవదాటని తనయుడిగా, సోదరులను అభిమానించిన అన్నగా, భార్య దూరమైన నిరంతరం ఆమె కోసం పరితపించే భర్తగా, ప్రజల సంక్షేమం కోసమే వారి మాటకు విలువిచ్చిన రాజుగా నిలిచాడన్నారు. ఎక్కడా ధర్మం తప్పకుండా మనిషి అనేవాడు ఇలా జీవించాలని చూపించినవాడు శ్రీరాముడని కొనియాడారు. ధర్మానికి ప్రతీక శ్రీరామచంద్రుడు అని, త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువే లోక కల్యాణం కోసం రాముడిగా అవతరించి, దుష్ట శిక్షణ చేశాడని రామాయణం తెలుపుతుందని వివరించారు. తండ్రి ఇచ్చిన మాట కోసం కట్టుబడి అరణ్యాలకు వెళ్లిన రాముడు ఇప్పటికీ ఎప్పటికీ ఆదర్శ మూర్తేనని ఎఎస్ పి తెలిపారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు కె ఆనంద్ దేవకుమార్ మాట్లాడుతూ ఆదిపురుష్ జయాపజయాలు గురించి కాకుండా, శ్రీరాముడి లాంటి గొప్ప పాత్ర పోషించి సాహసోపేతమైన నటనను ప్రదర్శించి అందరి అభిమానులను చూరగొన్నాడని చెప్పారు. అనంతరం నగరంలోని జీటీ రోడ్డులో ర్యాలీ నిర్వహించి జై శ్రీరామ్, జై ఆదిపురుష్... జైజై ప్రభాస్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం విజేత హోటల్ దగ్గర ఉన్న రామాలయంలో మజ్జిగతో ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాయితీ శ్రీను, దుమ్ము అప్పన్న, ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ చంద్రశేఖర్, ఆర్గనైజర్ మోహన్‌రెడ్డి, శ్రీను (మెడికల్), ఈశ్వర్, జె. సందీప్ (టాటూస్), గోపాల్, భాస్కర్ రాజు, గజపతి మోహన్, పల్లి శ్రీను, యశ్వంత్, లక్కీ కె. శ్రీను, నాయుడు, వెంకీ, ఫోటోగ్రాఫర్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

జూలై 1 నుంచి ఓటర్ల వెరిఫికేషన్

- ఇంటింటికీ వెళ్లనున్న బిఎల్ఓలు : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూలై1 నుంచి ఓటర్ల జాబితా వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూలై1వ తేదీ నుంచి బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాను తనిఖీ చేస్తారని తెలిపారు. దీనికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ పరిశీలనలో అధికారులు పక్షపాతంతో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి జాయింట్ ఎం నవీన్, ఇంచార్జ్ డిఆర్ఓ పి. మురళీ కృష్ణ, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, రాజకీయ పార్టీల నుంచి వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, టీడీపీ ప్రతినిధి పీఎంజె బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి దుప్పల గోవిందరావు హాజరయ్యారు.

ఇళ్ళ నిర్మాణాలపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రభుత్వం పేదలందరికీ సొంత ఇళ్ళను నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్ అన్నారు. సోమవారం హౌసింగ్ ఏఈ. ప్రసాద్‌తో కలసి సచివాలయ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలతో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని తెలిపారు. మున్సిపాలిటీలో 23.06.2023 నుండి 23.07.2023 వరకు ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జగనన్న కాలనీలో లబ్దిదారులతో ఇళు ్ళ కట్టించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మహేష్, సచివాలయ అడ్మిన్స్, రెవిన్యూ ఏమినిటీవిస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించేందుకు సమావేశాలు

విశాలాంధ్ర-జలుమూరు: కౌలు రైతులను గుర్తించేందుకు ఈ నెల 19 నుండి 26 వరకు సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, షెడ్యూల్ ప్రకారం ప్రతి ఆర్బికే పరిధిలో రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ ఉమ్మడిగా కౌలు రైతును గుర్తించే కార్యక్రమం అనేది నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బుక్క లక్ష్మణరావు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం లింగాలవలసలో సమావేశం ఏర్పాటు చేసి కౌలు రైతులుకు పంట సాగు పత్రాలు (కౌలు పత్రం) పొందటం వలన కలిగే లాభాలుపై అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ధాన్యం మద్దతు ధరకు అమ్మటం, పంట ఇన్సూరెన్స్, ఇన్పుట్ సబ్సిడీ, బ్యాంకు లోన్స్, వ్యవసాయ శాఖ ద్వారా అందించే పథకాల్లో సబ్సిడీ పొందడం వంటివి కౌలు రైతులకు వర్తిస్తాయన్న విషయాన్ని రైతులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పూర్తిగా భూమి లేనటువంటి వాళ్ళు కౌలు కి చేసిన యెడల రైతు భరోసా పథకానికి కూడా అర్హత ఉంటుందని, కాబట్టి యజమాని రైతులు కౌలుకు చేసినటువంటి రైతులకు 11 నెలలు కాలపరిమితికి సమ్మతిని తెలియజేస్తూ దరఖాస్తు సర్పించాల్సి ఉంటుందని తెలియజేశారు. అనంతరం పొలం గట్లపై కందులు సాగు చేయడం వలన అదనపు ఆదాయం పొందటానికి జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద 100 రాయితీపై రైతులకు కందులను మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బుక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

సేవలందించటంలో 'లయన్స్ క్లబ్' ముందుండాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: పట్టణ, గ్రామ ప్రాంతాల్లో పేద వర్గాలకు సేవలందించటంలో లయన్స్ క్లబ్ ముందుండాలని లయన్స్ జిల్లా గవర్నర్, డా.గోపాలరావు అన్నారు. మంగళవారం నరసన్నపేట లయన్స్ క్లబ్‌కు మర్యాద పూర్వకంగా విచ్చేసిన సంధ ర్భంగా ఆయన సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రొత్త క్లబ్‌లు ఏర్పాటు, కొత్త యువ సభ్యులు చేరికపై కొత్త పి.ఎస్.టిలు దృష్టి సారించాలని కోరారు. ఈ సంధర్భంగా పిడిజిలు వర్మకు రాఘవేంద్రరావులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్ సి, వూణ్ణ రంగనాథ్, అప్ కమింగ్ ప్రెసిడెంట్, సదాశివుని కృష్ణ, కార్యదర్శి, వి.నాగరాజు, కోశాధికారి, పొట్నూరు రమేష్, సీనియర్ లయన్స్ మెంబర్స్, బాలగంగాధర్, వూణ్ణ వేంకటేశ్వరరావు, రమణ సాహు, సాయిశ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వ్యవస్థను కించపరిస్తే ఊరుకునేది లేదు

డీలర్ల సంఘ బాల నాగిరెడ్డికి ఎండీయు ఆపరేటర్ల రాష్ట నాయకులు రౌతు హెచ్చరిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎండియు వ్యవస్థని కించపరుస్తూ మాట్లాడితే ఊరుకునేది లేదని,డీలర్ల సంఘ బాల నాగిరెడ్డికి ఎండీయు ఆపరేటర్ల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ హెచ్చరించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇటీవల డీలర్ల సంఘ గుత్తి జిల్లా అధ్యక్షుడు బాల నాగిరెడ్డి స్టాక్ పాయింట్ వద్ద మాట్లాడే వ్యాఖ్యలను ఖండిస్తూ తన మాట్లాడే మాటలను వెనక్కి తీసుకోవాలని ఎండియు వ్యవస్థని రద్దు పరచాలని వాక్యాలు చేస్తూ ఎండియు వ్యవస్థ వల్ల వారికి ఏమో నష్టం కలుగుతుందని అందువల్ల ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవాలని వాక్యం తగదన్నారు. డీలర్లుగా మీకు సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం దృష్టిలో పెట్టాలని ఎండియు వ్యవస్థ జోలికి వస్తే ఊరుకునేది లేదని ఎండియు వ్యవస్థ రావడం వల్ల డీలర్లకు కలిగిన నష్టం ఏంటో తెలియజేయాలన్నారు. ఎం డి యు వ్యవస్థ వల్ల డీలర్లకు పని భారం తగ్గిందే తప్ప ఆర్థిక భారం (కమిషన్) ఏ విధంగా కూడా తగ్గలేదని ఇదివరకు డీలర్ రేషన్ డిస్ట్రిబ్యూషన్ చేస్తున్న సమయంలో డిపో వద్ద కూర్చుని నెల రోజులు డిస్ట్రిబ్యూషన్ చేస్తూ తమ చేతివాటాలు చూపిస్తూ ప్రజలకు మభ్య పెట్టిన రోజులు పోయావని మా వ్యవస్థ వచ్చాక ఇప్పుడు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వెహికల్ తీసుకువెళ్లి ఖచ్చితమైన తోకవాతో నాణ్యతగాలసరుకులు అందించడం జరుగుతుందని ముగ్గురు లేదా నలుగురు డీలర్లు చేసే పని ఒక ఎండియూ ఆపరేటర్ చేస్తున్నాడని అన్నారు. ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక డీలర్ల వ్యవస్థ కనుమరుగైపోతాదేమో అనే భయంతో అవాకులు చవాకులు పేలుతున్నారని ఇటువంటి తాటాకు చప్పుడికి జడ్చే వ్యవస్థ ఏం డి యు వ్యవస్థ కాదని సూర్యనారాయణ అన్నారు. మా వ్యవస్థ జోలికి వస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఇప్పటికైనా ఎండియు వ్యవస్థపై తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఎండియు ఆపరేటర్స్ ప్రతినిధులు పిడుగు నరేష్, శంకర్, దివాకర్, రాజా, అప్పారావు, బాలకృష్ణ, సంతోష్, శ్రీనివాస్, మాధవ్, శివ ప్రసాద్, కిరణ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాల 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాలలో ఈనెల11 వ తేదీన నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల అయిందని ప్రిన్సిపాల్ ఎం ఈశ్వరరావు ప్రకటన ద్వారా తెలియజేసారు. ప్రవేశ పరీక్ష ఫలితాలు పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచటము జరిగిందని,విద్యార్థులు ఫలితాలను సరిచూసుకోని,పాఠశాలకు వచ్చి జాయన్ అవ్వాలని,పాఠశాల అడ్మిషన్ కొరకు విద్యార్థి ఆధార్ కార్డు,తల్లిదండ్రుల ఆధార్ కార్డులు,5 వ తరగతి రికార్డు షీటు తో పాఠశాలకు వచ్చి విద్యార్థి జయన్ అవ్వాలని ప్రిన్సిపాల్ ఎం. ఈశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

నిష్పక్షపాతంగా అన్ని వర్గాలకు సంక్షేమం

విశాలాంధ్ర-సోంపేట : ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎటువంటి వివక్షకు తావు లేకుండా లబ్ధిదారుల అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా ప్రభుత్వం అందిస్తుందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పేర్కొన్నారు. సోంపేటలో మంగళవారం ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన బీసీ సామాజికవర్గాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడారు. గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీల ద్వారా ప్రభుత్వ నిధులుదుర్వినియోగం చేయకుండా ప్రస్తుతం వలంటీర్ల ద్వారా గుర్తించి, ప్రభుత్వం ద్వారా నిర్ధారించి వారికి నేరుగా ఫలితాలు దక్కేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం పదిరెట్లు అధికంగా సంక్షేమ లబ్ధిని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, సోంపేట,కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాసురెడ్డి, కవిటి ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, ఇచ్ఛాపురం ఎంపీపీ ప్రతినిధి కారంగి మోహనరావు,కవిటి ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, కంచిలి జెడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, సోంపేట జెడ్పీటీసీ ప్రతినిధి తడక జోగారావు, ఇచ్ఛాపురం జెడ్పీటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, పిలక సంతు, గుమ్మడి రాందాసు, పిఎం తిలక్, నర్తు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కారణజన్ముడు కిరణ్‌చంద్

విశాలాంధ్ర-సోంపేట : అవయవ దానంతో ఐదుగురు ప్రాణాలను కాపాడి చిరస్మరణీయంగా నిలిచిన స్వర్గీయ మల్లారెడ్డి కిరణ్‌చంద్ కారణజన్ముడని స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంతో ఉన్నతమైన భవిష్యత్తుకు ఎదగాల్సిన కిరణ్‌చంద్ పదోతరగతిలోనే ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు గుండెకోతను మిగల్చడం ఎంతో దురదృష్టకరమని అన్నారు. అతని పేరు మీదుగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం స్థానిక రవీంద్రభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో నగదు ప్రోత్సాహకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి ఒక స్ఫూర్తినిచ్చిన కిరణ్ అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు : కిరణ్‌చంద్ జ్ఞాపకంగా నియోజకవర్గంలో సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల నుంచి ఎంపికైన 11 మంది విద్యార్థులకు సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కిరణ్ తల్లిదండ్రులు మోహనరావు దంపతుల చేతుల మీదుగా విద్యార్థులకు 5వేల రూపాయల నగదు, కిరణ్ చిత్రపటం కలిగిన మెమెంటో అందజేశారు. నగదు ప్రోత్సాహకాలను సోంపేటకు చెందిన పొందూరు మహేష్, శ్రీరాంపురంనకు చెందిన మార్పు సంధ్య, కొళిగాంకు చెందిన గానాల శైలు, బారువ కొత్తూరుకు చెందిన సిరిగిడి లయశ్రీ, బేసి రామచంద్రాపురంనకు చెందిన కరగాన మాధురి, బారువకు చెందిన టి.అంజి, బొరివంకకు చెందిన జన్ని కీర్తన, బిరదపాడుకు చెందిన గేదెల నందిని, డి.గొనపపుట్టుగకు చెందిన సారంగి ఇందు, బేసి రామచంద్రాపురంనకు చెందిన రవీంద్ర బాడిత్య, ఇచ్ఛాపురంనకుచెందిన సాడి కృష్ణవేణిలకు ఒక్కొక్కరికి 5వేల రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో రవీంద్రభారతి ప్రిన్సిపాల్ సింహాచలం, స్థానిక సర్పంచ్ ప్రతినిధి నగిరి శరత్‌బాబు, జెడ్పీటిసి ప్రతినిధి తడక జోగారావు, ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, ఇచ్ఛాపురం కౌన్సిలర్ బచ్చు జగన్, దట్టి అజయ్, పి.గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరులో ఆణిముత్యాలు

విశాలాంధ్ర-జలుమూరు: చల్లవానిపేట జెడ్పీ హైస్కూల్ లో పదవ తరగతి లోస్కూల్ ఫస్ట్, సెకెండ్, థర్డ్ వచ్చిన పిల్లలకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంకి ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలుమూరు ఎంపీపీ వానగోపి, పీఏసీఎస్ అధ్యక్షులు పాగోటి రాజప్పల నాయుడు, చల్లవానిపేట ఎంపీటీసీ ప్రతినిధి పొన్నాడ విజయకుమార్, వైస్ సర్పంచ్ ప్రతినిధి చిన్నాల మురళి, వార్డుమెంబెర్ దుంగ రమణ, స్కూల్ హెచ్ఎం, స్టాఫ్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : భక్తుల కీర్తనలు, భజనల నడుమ జగన్నాథ రథోత్సవాన్ని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి బలభద్ర సుభద్ర సమేత శ్రీ జగన్నాథున్ని ప్రత్యేకంగా అభిషేకించి పూజలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను రథారోహణం జరిపే కార్యక్రమాన్ని సాంప్రదాయకంగా జరిపారు. అలంకరణల అనంతరం భక్తులకు రథం పై కొలువు దీర్చిన ఉత్సవ మూర్తుల దర్శనం కల్పించి, రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో యాత్రను ప్రారంభించారు. శ్రీ నిలయం నుండి జగన్నాథుని పెంచిన తల్లి ఆవాసం గుడించా మందిరానికి కోలహలంగా చేర్చారు. రథాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలకరించి మేళ తాళాలతో రథయాత్రను సాగించారు. వై.సి.పి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్పీపీ బోర పుష్ప, జెడ్పీటీసి ఉప్పాడ నారాయణమ్మ తదితరులు ఉదయం స్వామి వార్లను దర్శించుకున్నారు. రథయాత్ర ప్రారంభానికి ముందు మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్ తన సిబ్బంది ఉపేంద్ర పొరిడా తదితరులతో కలిసి స్వామి ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో రథం పై దర్శన సమయంలో తోపులాటలతో పలువురు భక్తులు అసహనానికి గురయ్యారు. ఏ.ఎస్.ఐలు సింహాచలం, నాగర్జునల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

జలుమూరు: మండలంలో భగీరధపురం గ్రామంలో మంగళవారం జగన్నాధస్వామి రథయాత్ర ఘనంగా జరిగింది. సీతారాందాస్ పీఠాధిపతి, దేవాదాయ శాఖ ఈవో ప్రభాకరరావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీముఖలింగం గ్రామ సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, అర్చక సంఘం అధ్యక్షులు, కొండయ్య మాస్టర్, అర్చకులు, మర్రివలస గ్రామ సర్పంచ్ బి. లక్ష్మణరావు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మహంతి సీతారాం దాస్, మహంతి బావాజీలు పాల్గొన్నారు. ఈనెల 28వ తేదీన పూరీ నుంచి ప్రసాదం తెచ్చి అన్నదాన ప్రసాదాలు జరుపబడతాయని, ఈ కార్యక్రమానికి పీఠాధిపతి మహంతి

వాశీజరవృత్తాంని తెలియజేశారు. హరేరామ, హరేకృష్ణ బృందం 50 మందితో భజనా కార్యక్రమం నిర్వహించబడుతుందని, భక్తులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

స్కూల్ కి వెళ్ళాలంటే భయం భయం..

- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న బంజరపేట ఎంపీపీ స్కూల్..
- రామ మందిరం పైనే విద్య బోధనలు

విశాలాంధ్ర-నందిగాం : ఒకవైపు నాడు-నేడుతో ప్రభుత్వం రూపురేఖలు మారుస్తామని గర్వంగా చెబుతుంటే చిన్న చినుకులు పడితే చిత్తడిగా మారుతున్న పాఠశాలకు పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్న దుస్థితి దాపురించింది. మండలంలోని గొల్లబంజేరి పేట ఎంపీపీ స్కూల్ శిధిలావస్థకు చేరుకుంది. చిన్న చినుకు పడితేనే చాలు బురదమయంగా విద్యార్థులు కూర్చోవడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. గోడలు పెద్దపెద్ద పగుళ్లు ఇవ్వడంతో స్కూల్ లోకి పాములు రావడం సర్వసాధారణంగా మారింది. చినుకులు పడితే చాలు పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంకా ఎక్కడ చదువుకోవాలో తెలియని పరిస్థితిలో ఊర్లో ఉన్న రామా మందిరంలో పిల్లలు చదువును సాగిస్తున్నారు. దీనిపై ఎంఈఓ ని సంప్రదించగా పై అధికారులే చూసుకుంటారు మేమేమీ చేయలేమని మాటను దాటివేసి ఫోన్ ని కట్‌చేయడం చూస్తుంటే సంబంధిత అధికారులు తీరు చాలా దారుణంగా ఉంది. పెద్ద సమస్య రాకముందునే జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని, గ్రామస్తులు ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు. ఇంతకు ముందున్న ఎంఈఓ కి అదే గ్రామానికి చెందిన మహిళలు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి ఆధునీకంగా తీర్చిదిద్దుతుంటే ఇక్కడ మాత్రం పాఠశాలకు మాత్రం అభివృద్ధి జాడలు కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా పిల్లలు ఎక్కడికి వెళ్లి చదువుకోవాలి స్కూలు శిథిలావస్థకు చేరుకోవడంతో స్కూలుకు పంపించాలంటే మాకు భయం వేస్తుందని పైకొప్పు ఎప్పుడైనా పిల్లల మీద పడి పిల్లలకి ఎటువంటి ప్రాణ నష్టం జరగకముందే చర్యలు చేపడితే బాగుటుందని గ్రామస్థులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని జగన్నాధపురం పంచాయతీ సర్పంచ్ జోగి రాములమ్మ అన్నారు. మంగళవారం జగన్నాధపురంలో ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ రాములమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల మత్స్యకారు గ్రామాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో ఆనంద దాయకమని అన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని ప్రజల కోసం వైద్య సిబ్బంది మన గ్రామాలకే వచ్చి వైద్యం చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఇటువంటి శిబిరాలు కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని అన్నారు. బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి (104) డాక్టర్ వనిత ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత తనిఖీలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ఎంలు, కె నర్సమ్మ, ఎల్ సంతోషి, ఆశావర్కర్లు నీలవేణి, కోటీశ్వరి పాల్గొన్నారు.

పాతపట్నంనకు పుట్ట గొడుగుల్లా స్థానికేతరులు

ఎంపీపీ తూలుగు మేనక తిరుపతిరావు...

విశాలాంధ్ర-హిరమండలం: పాతపట్నం నియోజకవర్గనికి స్థానికేతర్లు రోజు రోజుకి పుట్టగొడుగుల్లా పుట్టు కొస్తున్నారని స్థానికులకే రాబోయే 2024 ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు పట్టం కట్ట నున్నారని ఎంపీపీ ప్రతినిధి తూలుగు తిరుపతి రావు మాస్టర్ స్పష్టం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం లో మంగళవారం ఎంపీపీ ఛాంబర్ నందు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాస్టర్ మాట్లాడు చూ స్థానికేతరులు ఎమ్మెల్యే అయి వారి వల్ల ఎన్నోఇబ్బందులు నియోజకవర్గ ఓటర్లు చవి చూసారని అలాంటి తప్పులు మరి చేయదళచు కొరని ఈసందర్భంగా వివరించారు స్థానికేతర్లును నమ్ము కున్న నాయకులు కు ప్రజలు కు దిక్కు ఎవరని వారికి వారు పోటీ చేసి వెళ్లి పోతారు ఆతరువాత వీరికి అందుకున్ననాయకుడు ఎవరు అని ప్రశ్నించారు,, జిల్లా స్థాయి నాయకులు ప్రజా ప్రతినిధులు దృష్టిలో ఉంచుకొని ప్రజల్లో మంచి పలుకుబడి ఉన్న స్థానిక నాయకులు కే ఎమ్మెల్యే టికెట్ లు అందజేయాలని ఆలా కాని పక్షం లో ఇండిపెండెంట్ లు గా స్థానికులు ను బరిలో దించ నున్నట్లు కొనియాడారు.... నియోజకవర్గప్రజా శ్రేయోభిలాషి గా నే మాట్లాడు చున్నాను గానీ నాకు ఎమ్మెల్యే గా పోటీ చేసే ఆసక్తి లేదని ఒక ప్రశ్న కు సమాధానం గా చెప్పు కొచ్చారు, నియోజకవర్గం నాలుగు పర్యాయలుగా స్థానికేతరుల ను ఎమ్మెల్యే లు గా గెలిపించిన ఘనత ఉందని అందుకే పాత పట్నం నియోజకవర్గం వైపే స్థానికే తర్లుకన్ను పడుతోందని గుర్తు చేశారు,,, ఎంపీపీ వెంట ఎంపీటీసీ తట్ల శంకర్ రావు, గులు మూరు సర్పంచ్ సుంకరి కోటేశ్వరరావు, పింద్రు వాడ సర్పంచ్ ప్రతినిధి మండదండాసి,వై తవిటయ్య, గొలివి మోహన్ రావు, చండకనాగేశ్వరావు, గొర్లె రమేష్, కరణం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.